అడల్ట్స్ ఓన్లీ కథ

# రిటార్న్స్

ఉదయశ్రీ

''నన్ను చూస్తే ఏమనిపిస్తోంది మీకు?''

కొంచెం ఓరగా తలతిప్పి కనుకొలకుల్లోంచి చూస్తూ కనుబొమలు పైకెత్తి కోపాన్ని కంఠంలోకి అరువు తెచ్చుకుని అడిగింది రమణి.

''నిజం చెప్పనా? ఆంధ్రభూమి మొదటిపేజీ లోపలి అట్టపైనా, చివరి అట్ట లోపలివైపూ చిత్రించిన బాపూ బొమ్మల్లా ఉన్నావు సుమా!''

''చాల్లెండి'' పెదవులలా అన్నా కళ్ళల్లో గర్వం తొంగి చూసింది.

''ఎలా ఉంటేమిటే ఒళ్ళు?'' దబాయించింది.

''అబ్బా! అడక్కే బాబూ! ఏమిటో తిమ్మిరిగా అదోలా ఉంది - ఒళ్ళంతా సెగలు పొగలు కక్కుతోంది. చూడు జ్వరం వచ్చినట్లుంది''

చేయి చాచాడు హరి.

''మీ వేషాలు నాకు తెలుసులెండి. గంటనుండి లేపుతున్నాను. ఆఫీసు టైమయిపోతుంది''

''ఇది పగలా?''

''పగలు చాలుగాని పైకి లేవండి''

''లేవలేను. పీకలోతు కూరుకుపోయానే బాబూ! ఏనాడు పెళ్ళయిందో ఆనాడే కాలు జారాను. మా శేఖరం చెప్తూనే ఉన్నాడు. సంసార సాగరంలో పడ్డావురా బాబూ! ఇహ నిన్ను గజేంద్ర మోక్షంలోలాగా విష్ణుమూర్తి అయినా రక్షించలేడు అని''

''మరి ఎంచక్కా సన్యాసం పుచ్చుకోవాల్సింది. నా ప్రాణం హాయిగా ఉండేది కదా!''

''ప్రాణాలు తీసేవాళ్ళు ప్రాణాలు హాయిగా ఉండాలనుకోవటం అమానుషం''

''తెలుగు బాగానే వచ్చే!''

''బాగానేనా? నండూరి వారి ఎంకి పాటలు పాడుతుంటే కాలేజీలో అమ్మాయిలంతా చెవులప్పగించేవారనుకో!''

''ఆహా! మరి వాళ్ళల్లో ఎవర్నో చూసుకోక నాపాల పడ్డారేమిటో?'' మూతి ముడిచింది.

''ఖర్మ! అంతే! నుదుట రాసిన రాత చెరపగలమా? పట్టుమని పాతికేళ్ళు రాకుండానే ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక తన్నుకుంటున్నాను. పైకి లేవాలని ప్రయత్నించిన కొద్దీ ఇంకా లోపలికి దిగబడి పోతున్నాను. అవునూ! నాకు పెట్టేది కాకుండా నువ్వేమైనా స్పెషల్స్ తింటున్నావేమిటే? పెళ్ళయినప్పటి కన్నా ఇప్పుడే ఇంకా నమ్‌కీన్‌గా ఉన్నావు కదా! ఇద్దరు పిల్లలు పుట్టాక కాస్త ఒళ్ళు చేసి పూర్ణ చంద్రుడిలా ఉన్నావే రమణీ!''


''ఇక చాలు. ఇవాళ కదిలేదుందా లేదా?''

''ఏం? పక్కింటావిడతో పెరటి గోడమీద ఊసులకు వేళయిందా? అయినా పెరటిగోడలెక్కడివి ఈ కాంక్రీటు నగరంలో? తలుపు తీస్తే ఎదుటి గుమ్మం ప్రత్యక్షమయ్యే అపార్టుమెంట్లే కదా! తామరతంపర్లా ఎక్కడ ఖాళీ కనపిస్తే అక్కడ బిల్డింగులు లేచిపోవటమే. అన్నట్లు నీకు తెలుసా? మీ ఫ్రెండు లావుగా గుమ్మడి కాయలా ఉంటుందే! ఆవిడ గోడకి అస్తమానం చెవి ఆనించి వింటుందట, ప్రక్క పోర్షనులోకి ఎవరో కొత్తగా పెళ్ళి అయిన వాళ్ళొచ్చారటలే. ఇహ పాపం మావాడి అవస్థ చెప్పలేం. ఈసురోమంటూ ఆఫీసుకొచ్చి నిద్రపోతుంటాడు. సాయంత్రం అందరూ అరగంట ముందే ఇంటికి వెళ్ళటానికి రెడీ అయితే వాడు మాత్రం భయంభయంగా గడియారం చూస్తుంటాడు.''

నవ్వాపుకుంది రమణి.

''చాల్లెండి. మీ మగాళ్ళకెప్పుడూ అదే ధ్యాస. అయినా ఆఫీసులో మీరు చేసే పనులూ, చెప్పుకునే కబుర్లూ ఇవేనన్నమాట. మా ఆడవాళ్ళని అంటారే గాసిప్ చేస్తామని. మీరేం తక్కువ?''

''నాలాంటి వాడు దొరకబట్టే నీకేం తెలీటంలేదు. సుష్టుగా భోంచేస్తే చిరుతిళ్ళమీద ధ్యాస ఉండదు కదా! మా భాటియా ఇళ్ళ దగ్గర ఒక భాబీ ఉందట. 'ఆయియే ఏక్ కప్ చాయ్ పీకే జాయియే' అంటుందట''



''అంటే? అందులో తప్పేమిటి? మీ మగాళ్ళు ఎంతసేపూ తమ గొప్ప చాటుకోవాలని పెడర్థాలు తీస్తుంటారు'' ఫైరయింది రమణి.

''కాదోయ్! పెద్దవాళ్ళు ఏ మాటా ఊరికే చెప్పరు. తాటి చెట్టుకింద నిలబడి పాలు తాగినా కల్లే అనుకుంటారట. అలాగే పరాయి మగాళ్ళని మా ఇంటికి రండి అని పిలిస్తే అంతేమరి. మా భాటియా కొంచెం సరదా పురుషుడు. జోకులేస్తూ కల్పించుకుని అందర్నీ పలకరిస్తుంటాడు. ఈవిడ భర్తతో సహా వీళ్ళింటికి విజిట్‌కొచ్చిందట. మాటల్లో రెండు ఫ్యామిలీలు కలిసి గోవాకి హాలీడే స్పెండ్ చేయటానికి వెళ్ళాలని సజెస్ట్ చేసిందట. మావాడు ఎగిరి గంతేశాడు. వాడి భార్య, ఈవిడ హజ్బెండు కుదరదన్నారట. పోనీ లెండి. మీకు నచ్చకపోతే మేమిద్దరం వెళ్ళి వస్తాం అందిట ఆవిడ. ఎంత ఫార్వర్డో చూశావా?''

''వేరే ఆవిడ ఆ మాట అంటే ఫార్వర్డే. అదే మాట సొంత పెళ్ళాం అంటే అప్పుడు లబలబ లాడతారే మొగుళ్ళు, సరేకాని ఇవాళ ఆఫీసు వెళ్ళేది లేదా ఏమిటి?''

''నువ్వెక్కడ దొరికావే నాకూ? ఏ పెళ్ళామైనా మొగుడు ఇంట్లో ఉంటే సంతోషిస్తుంది. నువ్వేమిటి ప్రాణాలు తీసేస్తున్నావు? పిల్లలు వెళ్ళారా?''

''వెళ్ళి అరగంటయింది''

''ఇంత శుభవార్త ఇప్పుడా చెప్పేది? ఇవాళ వెళ్ళను. ఎన్నాళ్ళయింది ఇలా ఇద్దరమే ఉండి?''

చెయ్యిపట్టుకుని లాగి రమణి కూలబడితే ఒళ్ళో తలపెట్టుకున్నాడు హరి.

''బాగుంది సంబరం! ఇద్దరు పిల్లలుంటే ఇంకా...''

''అయితే ఏమంటావు? పిల్లలు మన ప్రేమలతకు పుష్పాలు. వాళ్ళవల్ల అనుబంధం గట్టిపడుతుంది. ట్రాఫిక్ సిగ్నల్స్‌లా మన వేగాన్ని కంట్రోలు చేస్తారనుకో. ఆరోగ్యానికి మంచిదే కదా! పెళ్ళి కానివాళ్ళు పెళ్ళికోసం, పెళ్ళయిన వాళ్ళు పిల్లల కోసం, ఆ తర్వాత వాళ్ళ చదువులు పెళ్ళిళ్ళు అంటూ ప్లానులూ ఇదే జీవిత చక్ర భ్రమణం. అన్నట్లు నీకు విండో లవ్ గూర్చి చెప్పలేదు కదూ! కొంచెం కిందికి వంగు చెబుతాను''

అనుమానంగా చూసింది రమణి.

''అబ్బెబ్బె! నీ తోడు. నా కాలేజి టైములో విషయం కాదోయ్. ఇది మా సువర్ణ కుటీర్‌లో మా అప్పారావు ఉంటాడుకదా! వాడు చెప్పిన సంగతి. వాడు నాలుగో ఫ్లోరులో ఉంటాడు. అది మొత్తం ఎనిమిది ఫ్లోర్ల బిల్డింగ్. ముప్పై రెండు ఫ్లాట్లు ఉంటాయి. అస్తమానం కేబుల్ డిస్టర్బెన్సు వస్తుందని వీడు వరండాలోకి వెళ్ళొట్ట వైరు కనెక్షన్స్ చూద్దామని. వాడి కళ్ళ ఎదురుగానే అయిదో ఫ్లోరు కిటికీలోంచి ప్రక్క ఫ్లోరు కిటికీ వరకు ఒక బూజు కర్ర వెళ్ళిందట.''

హరి జుట్టు పీకింది రమణి.

''బూజుకర్ర వెళ్ళటమేమిటి? హరికథ చెప్తున్నారా?''

''కాదే బాబూ! నిజంగానే! వీడు ఆశ్చర్యపోయి చూస్తుండగానే ఒక చెయ్యి వచ్చి ఆ ప్రక్క ఫ్లోరు తాలూకు అన్నమాట. బూజుకర్రని ఆప్యాయంగా తడిమి ఒక పేపరులాంటిది తీసుకుందట. మళ్ళీ బూజుకర్ర నిశ్శబ్దంగా వెనక్కి వచ్చేసిందట''

''బాగుంది'' నవ్వింది రమణి.

''హంస రాయబారాలు, చిలుక, పావురాళ్ళ రాయబారాలు అయిపోయాయి పురాణాల్లో. ఇప్పుడు పోస్టు పాతబడి ఇ-మెయిల్, ఛాటింగ్స్ విన్నాం కానీ ఈ ప్రహసనం ఇప్పుడే వింటున్నాం.''

''దీన్ని విండో లవ్ అంటారు. లేదా అపార్ట్‌మెంట్ లవ్ అన్నా సరే నీ యిష్టం'' అన్నాడు హరి.

రమణి ఏం తక్కువ తినలేదు.

''అపార్ట్‌మెంట్ లవ్ ఏంటి డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లాగా? మీరు స్టూడెంట్‌గా ఉన్నప్పుడు ఏదో రూమ్‌లో అద్దెకున్నారు కదా! ఆ ఎదురింటి కిటికీలోంచి ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఎప్పుడూ మిమ్మల్ని చూసేవాళ్ళని చెప్పారుగా. మరి అప్పుడు ఎలా వెళ్ళేవి లవ్ లెటర్స్?''

అమాయకంగా అడిగింది.

''అబ్బే!'' చప్పరించేవాడు హరి.

''లవ్ లెటర్స్ దాకా ఎక్కడ? వాళ్ళ నాన్న వరండాలో పడక్కుర్చీ వేసుకుని పులిలా కూర్చుని ఉండేవాడు. మేం నలుగురం ఆయన భోజనానికి వెళ్ళినప్పుడే కిటికీ దగ్గర చేరే వాళ్ళం. వాళ్ళు ఇద్దరు, మేం నలుగురం. మోనో యాక్షన్. పావుగంట ఎంజాయ్ చేసే వాళ్ళం. అంతలోనే ఆయన వచ్చేసేవాడు. షో 'ది ఎండ్' అయిపోయేది. దూరం నుండే ఏ వేషాలేసినా...''

''షటప్!'' కళ్ళెర్ర జేసింది రమణి.

''నిజంగా ఒక్కోసారి నామీద నాకే జాలి వేస్తుందోయ్. కాలేజీ డేస్‌లో ధైర్యం చాల లేదు. యూనివర్సిటీకొచ్చేసరికి మా నాన్న గార్కి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. ఇంకేం వేషాలు వేసే వీలులేకపోయింది. పోనీ పెళ్ళి చూపుల పేరుతో ఒక పదిమంది అమ్మాయిల్ని చూద్దామనుకుంటే ప్రథమంగా నిన్ను చూడటంతోనే క్లీన్ బౌల్డ్! మాట పడిపోయింది. ఏమిటంటావు? మెత్తని దొంగవి'' నడుం మీద చెయ్యేసి సరిగమలు పలికించాడు.

లోపల సంతోషిస్తూనే పైకి విచారంగా,

## నంబర్ వన్ పూనమ్?

**తెలుగులో మొదటి సినిమా, బాస్, పరుగు లాంటి సినిమాల్లో నటించిన పూనమ్ బజ్వాకి ఇటీవలే తమిళ ఇండస్ట్రీ నుంచి ఆఫర్ వచ్చింది. ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి కొడుకు జీవా హీరోగా నటిస్తున్న సినిమాలో పూనమ్ బజ్వా హీరోయిన్. త్వరలోనే పూనమ్ తమిళ రంగంలో నంబర్ వన్ హీరోయిన్ అవుతుందని జీవా ఢంకా బజాయించి మరీ చెబుతున్నాట్ట. ఆ మాటలు విన్న పూనమ్ సహజంగానే ఆనందం కలుగుతుంది కదా! మరి జీవా జోస్యం ఎంతవరకూ నిజమవుతుందో చూడాలి!**



''నిజంగా నాక్కూడా అనుకోకుండానే అయిపోయిందండీ, అసలు ఒక డ్యాక్టరు భార్యని కావాల్సిన దాన్ని''

షాక్ తగిలినట్లు లేచి కూర్చున్నాడు హరి.

''ఎప్పుడూ చెప్పలేదేం? ఎవరా డ్యాక్టరు?''

''ఉండండి. కాఫీ తాగుదాం.''

సస్పెన్సును పోషిస్తూ వంటింట్లోకి నడిచింది.

అయిష్టంగానే బ్రష్ చేసుకుని సోఫాలో కూలబడ్డాడు హరి. సగం ప్రాణం లాగేసినట్లు నీరసంగా ఉంది. వేడి వేడి కాఫీ కప్పు చేతిలో పెట్టి పక్కనే కూర్చుంది రమణి. తనూ కాఫీ సిప్ చేస్తూ టి.వి. ఆన్ చేసింది. గంభీరంగా మొహం పెట్టి అప్పటిదాకా ఏమీ అడక్కుండా బిగబట్టిన మాటల్ని ఇహ ఆపుకోలేక కోపంగా రిమోట్ నొక్కి టి.వి. ఆఫ్ చేశాడు.

''కొంచెం సేపయినా ఆ గోల ఆపు. నీ డ్యాక్టరు కథేమిటో చెప్పు'' సీరియస్‌గా అన్నాడు.

''ఏ డ్యాక్టరు కథ? ఓహో! అదా! బలే తమాషాలెండి. ఆ రోజు పని మనిషి రాలేదు. నేను ఇల్లు ఊడ్చి కాంపౌండు గోడనుంచి చెత్తచేటతో వీధిలోకి విసరేశాను. మా ఇంటికి దగ్గర్లోనే మెడికల్ కాలేజీ ఉండేది. చాలా మంది స్టూడెంట్లు గదులు అద్దెకు తీసుకుని ఉండేవారు. పాపం! తెల్లటి బట్టలతో వెళ్తున్న ఒక అబ్బాయి మీద చెత్త పడింది. తలెత్తి చూశాడు. నా గుండె ఆగిపోయింది. ఒక చేతిలో చీపురూ, ఒకచేతిలో చేటా... ఒక్క పరుగున ఇంట్లోకి పరుగెత్తి వంటింట్లో తలుపు వెనకాల దాక్కున్నాను. ఆ అబ్బాయి లోపలికి రావటం నాన్నగారు ఏవో సమాధాన పరచి పంపటం తెలుస్తూనే ఉంది. ఆ తర్వాత ఆ అబ్బాయి ఎప్పుడు వెళ్ళినా ఇంటి వైపు చూస్తూ వెళ్ళేవాడు. నేనూ కుతూహలంగానే గమనించేదాన్ని. నాన్నగారు కనిపించినప్పుడల్లా అతన్ని పలకరించటం, ఒకటి రెండుసార్లు కాఫీ ఇచ్చి పంపటం చేసేవారు. అప్పుడు అతని కులగోత్రాలు కనుక్కుని చదువు పూర్తి అవగానే పెళ్ళి మాటలు కదిపారు''

''మరి చేసుకోలేకపోయావా?'' ఉక్రోషం దాగటం లేదు.

నవ్వు దాచుకుని, అమాయకంగా ముఖం పెట్టి అంది రమణి..

''కట్నం కుదరలేదనుకుంటాను. అయినా ఈ ఇంట్లో చాకిరే రాసిపెట్టి ఉందిగా నాకు''

''ఓహో!'' సీరియస్‌గా చూశాడు. ''ఎంత మంది చూశారు నిన్ను పెళ్ళి చూపులకు?''

''ఒక అరడజను మంది పైగానే. మీరు ఎయిత్ కాండిడేటు''

''ఊ!..'' మూలిగాడు. ''అంతమందికి నువ్వు నచ్చలేదా? నీకు ఎంత మంది నచ్చారు?''

''నాకు అందరూ బాగానే ఉన్నారు. మా అమ్మా నాన్న ఎవర్ని చేసుకోమంటే వాళ్ళనే చేసుకునేదాన్ని వాళ్ళకు మీరు నచ్చారు. అంతే, పెళ్ళియిపోయింది'' సింపుల్‌గా చెప్పింది.

''ఉండండి. చాలా టైమయింది. టిఫెన్ తెస్తాను'' వెళ్ళింది.

గాలి తీసిన బెలూన్‌లా అయిపోయాడు హరి.

అందరిలో మీరు ప్రత్యేకంగా కనిపించారు అనో మీతో వాళ్ళకి పోలికేమిటండీ అనిగాని, అదేమిటో మిమ్మల్ని చూడగానే గుండె గుబగుబలాడింది అనో చెప్పవచ్చుగా! వాళ్ళమ్మ నాన్నలకు నచ్చితే చేసుకుందిట! ఒళ్ళంతా సెగలు కక్కినట్లయింది. అయినా ఇన్నేళ్ళలో ఎప్పుడైనా ఈ విషయాలన్నీ చెప్పిందా? నేనే పిచ్చివాడిలాగా చూసిన మొదటి దాన్నే పెళ్ళి చేసుకున్నాను. ఆఫీసు కబుర్లు కూడా ఇంట్లో చెప్పేస్తాను దాచుకోకుండా. నా చిన్నప్పటి సంగతులు కూడా. అమ్మో! ఈ ఆడవాళ్ళు అసాధ్యులు. అందుకే మా నాన్నమ్మ అనేది ఆడదాన్ని ఎప్పుడూ నమ్మి అన్ని విషయాలూ చెప్పకూడదురా లోకువ కడతారని. నిజంగా లోకువైపోయాను కదా! తన మీద తనే జాలి పడ్డాడు.

టిఫెన్ ప్లేట్లతో వచ్చింది రమణి. హరి ముఖం చూసి ఏమీ తెలియనట్లుగానే అన్నట్లు ''మాట వచ్చింది కాబట్టి గుర్తుకు వచ్చింది. బస్ స్టాప్‌లో కూడా ఎప్పుడూ ఒక క్రిస్టియన్ అబ్బాయి నలుగురైదుగురు కుర్రాళ్ళతో కలిసి ఉండేవాడు. అమ్మాయిల మీద కామెంట్లు విసురుతూ ఎవరైనా వాటిని లైక్ చేస్తారేమోనని ట్రై చేస్తుండేవాడు. జేబులో మూడు నాలుగు లవ్ లెటర్స్ ఉండేవట. అందరికీ ఇస్తూంటాడు. నాకు ఒకటిచ్చాడు. అపార్థం చేసుకోవద్దు ప్లీజ్. మీరు జవాబిస్తే లక్కీ ఫెలోని నేనే అన్నాడు''

పళ్ళు నూరాడు హరి. ''ఇచ్చావా?''

''వెంటనే చింపిపడేశాను. ఏమీ మాట్లాడలేదు. దానితో ''సారీ'' అని వెళ్ళిపోయాడు. వాడి ఫ్రెండ్స్‌లో ఒకణ్ణి వాళ్ళ పక్కింటి అమ్మాయి ప్రేమించిందట. వీడు వాళ్ళిద్దరి మధ్యా పుల్లలు పెట్టేవాడు. వీడి సంగతి తెలిసీ ఆ ఫ్రెండు వాడి మాటలే నమ్మేవాడు. తమాషా కదూ! అనుమానం అనేది మీ మగవాళ్ళ రక్తంలోనే ఉంటుందనుకుంటాను. మన బుద్ధి ఎలాంటిదో మనకు తెలీకపోయినా ఎదుటివాళ్ళను బాగానే గమనిస్తాం కదా! ఆడవాళ్ళకు అసూయ తోబుట్టువు అంటారే! అలాగే మగాళ్ళకు అనుమానం అన్నగారు ఒక్కరుంటారు మీలాంటి వాళ్ళు.''

రెండు చేతుల్తో చెంపలు పట్టి పైకెత్తి నుదిటిమీద ముద్దు పెట్టుకుంది. కాస్త చల్లబడ్డాడు హరి.

## టైముని బట్టి...

**'ప్రేమిస్తే' సినిమా ద్వారా పరిచయం అయిన సంధ్య- టీనేజ్‌లోనే సంచలన తారగా గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత చెప్పుకోదగిన హిట్టు లేదు. అటు తమిళం, ఇటు తెలుగులోనూ సినిమాలు లేవు. దీంతో తన మాతృభాష మలయాళంలో వచ్చిన ఆఫర్లను వదులుకోవడంలేదామె. తాజాగా ఆమె ఓ చిత్రంలో నెగటివ్ షేడ్స్ వున్న పాత్రను సైతం ఒప్పుకుందిట. అదేంటీ అంటే- నటి అన్నాక అన్ని రకాల పాత్రలూ వేసి మెప్పించాలిగా అంటూ తెలివిగా మాట్లాడేస్తోంది. అంతేలెండి.**



''కానీ నీ చేటా, చీపురూ, డ్యాక్టరు వ్యవహారం నాకేం నచ్చలేదు'' కంప్లెయింట్ చేశాడు.

''మరి తమరి కాలేజీ డేస్ లవ్‌లూ, విండో లవ్‌లూ అని ఇంకా తలచుకుంటుంటారే! నాకు వాతలు పెట్టాలనిపిస్తుంది.''

''అమ్మదొంగా! అదా సంగతి! ఎంత ఏడిపించావే! ఏదో సరదాకి...''

''మరి అదే సరదా పెళ్ళాలకుండకూడదా?''

''కూడదు. పుణ్యకాలం కాస్తా గడిచిపోయేట్లు చేశావు కదే రమణీ! నిన్నేమనాలో తెలీటం లేదు. పిల్లలొచ్చేవేళయింది.''

''ఇవాళ డుమ్మా కొట్టారుగా. నన్నేమనాలో తీరిగ్గా ఆలోచించండి. నాకు మాత్రం సెలవులేదుగా'' అంటూ వంటింట్లోకి నడిచింది రోగం కుదిరింది అనుకుంటూ. ☆